కష్టాలు తీర్చే ప్రజా నాయకుడు జగనన్న

ప్రభుత్వ విద్య సలహాదారు
ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చే ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన బి.పప్పూరులో సచివాలయం, ఆర్బీకే, గంగనపల్లిలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, గూగూడులో సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్బీకే, మండల కేంద్రంలోని సచివాలయం ,రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన ఆయా గ్రామాలకు చేరుకోగానే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పటాసులు పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో దేశంలోనే సరికొత్త విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నలకు అండగా నిలిచారన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే దృఢ సంకల్పంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. గ్రామాల్లోనే వైఎస్సార్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా వైద్య అందిస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమాలను సమానంగా చూస్తూ ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. పేదల కష్టాలను తెలుసుకున్న జగనన్న వారి అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో మరోసారి జగనన్న ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైరపర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారి ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, కో ఆప్షన్ షాబీరా, సర్పంచులు మస్నీల సుప్రియ, కుళ్లాయిరెడ్డి, రమణకుమారి, ఎంపీటీసీలు బాలనాగి భాగ్యలక్ష్మి, పద్మాకర్‌రెడ్డి, రాజారెడ్డి, ఉప సర్పంచ గవ్వల శ్రీరాములు, నాయకులు పెద్దిరెడ్డి, రమేష్ రెడ్డి, సంజీవరాయుడు, తుంపెర పక్కీరరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రమణ, వెంకటరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బి.పప్పూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

ముచ్చుకుంటపల్లి ఆయకట్టుకు నీరందిస్తాం

నార్పల: హెచ్చెల్సీ నుంచి ముచ్చుకుంటపల్లి ఆయకట్టుకు నీరందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన గంగనపల్లి వద్ద హెచ్చెల్సీలో తువ్వుపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్చెల్సీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ముచ్చుకుంటపల్లిలోని 850 ఎకరాల ఆయకట్టుకు నీరందడంతోపాటు దాదాపు 200 ఎకరాలకు భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను మరమ్మతు చేయించి సాగు నీరందేలా చూస్తామన్నారు. ఆయకట్టు చైర్మన్ వెంకటనారాయణరెడ్డి, ఆదిరెడ్డి, రాజశేఖర్, వెంకటరెడ్డి, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు గుత్తి విద్యార్థులు


గణేష్, అఖిల్‌తో పీఈటీ హాజి మలంగ్

గుత్తి: ఈ నెల 21 నుంచి గుంటూరు నాగార్జున యూనివర్సిటీ మైదానంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు గుత్తి కోటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణేష్, అఖిల్ ఎంపికైనట్లు హెచ్ఎం సుబహాన్, పీఈటీ హాజి మలంగ్ చెప్పారు. గణేష్ షాట్ పుట్, అఖిల్ జావెలిన్ త్రోలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గణేష్, అఖిల్‌ను హెచ్ఎం, పీఈటీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ


ప్రశంసాపత్రాలను అందుకున్న విద్యార్థులు

తాడిపత్రి అర్బన్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ పొందవచ్చని మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గౌతమ్ పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ జపాన్ షూటోరియ బెల్ట్ గ్రేడింగ్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ అనేది చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ నేర్చుకోవచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణే కాకుండా ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోచ్ మధు, హసీనా, మధుసూదన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో సర్వలోకాల సృష్టికర్త, వివిధ వృత్తులకు ఆద్యుడైన విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విరాట్ విశ్వకర్మ పూజా మహోత్సవం చేపట్టారు. సంఘం పట్టణ అధ్యక్షుడు సంపత్ ఆచారి మాట్లాడుతూ విశ్వకర్మ ఆది కార్మికుడని, పంచకర్మ సృష్టికర్త అని కొనియాడారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రామాచారి, సంఘం పెద్దలు సురేష్, ఆదినారాయణ, ప్రదీప్, శ్రీనివాస్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ మరమ్మతు వేగవంతం చేయండి


మ్యాన్‌హోల్ వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవి

తాడిపత్రి అర్బన్: అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి కార్మికులను ఆదేశించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీలకు సంబంధించిన మ్యాన్‌హోల్స్ వద్ద చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వీలైనంత త్వరగా బ్లాక్ అయిన మ్యాన్‌హోల్స్‌ను పునరుద్ధరించాలన్నారు. వార్డుల్లో ఎక్కడైనా మ్యాన్‌హోల్స్ నుంచి నీరు లీకేజీ అయితే వెంటనే వాటిని గుర్తించి మరమ్మతు చేయాలని సూచించారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం

పెద్దవడుగూరు : చిత్రచేడు గ్రామంలో ఆదివారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి వేడుకలను బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. విశ్వకర్మ పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన వారికి 18 రకాల చేతివృత్తి పనులు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, మునయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ అస్రార్‌బాషా


శింగనమల: గ్రామాల్లో వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ అస్రార్ బాషా సూచించారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వినాయక ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, నిమజ్జనం కార్యక్రమం ఈనెల 20వ తేది 5 గంటల లోపు పూర్తి చేయాలన్నారు. ఎస్ఐ సాయిప్రసాద్, ఏఎస్ఐ చితంబరయ్య పాల్గొన్నారు.

పామిడి: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాజశేఖర్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. వినాయక ప్రతిమల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి ఉండాలన్నారు. మండపాలకు విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్‌శాఖాధికారుల నుంచి అనుమతి పత్రం తప్పనిసరి అన్నారు. మంటపాల వద్ద సినిమా పాటలు కాక కేవలం భక్తిగీతాలు పెట్టాలన్నారు. పాదచారులు, వాహనచోదకులకు అసౌకర్యంగా లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ఊరేగింపు, మైకు పర్మిషన్ తప్పనిసరి అన్నారు. నిర్దేశిత స్థలంలోనే గణేష్ నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు.

యాడికి: వినాయక నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా ఆదివారం మోడల్ స్కూల్ సమీపంలో గల వంకను ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా మండల వ్యాప్తంగా 130 వినాయక విగ్రహాలు మాత్రమే పోలీసుల అనుమతితో ఏర్పాటు చేసుకున్నారన్నారు. నిర్వాహకులు బుధవారం సాయంత్రం 6.30 గంటల లోపు నిమజ్జనం పూర్తి చేసుకోవాలన్నారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ రామాంజనేయులు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్


సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు, మూల మంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పురవీధుల్లో ఊరేగిన వెండి వినాయకుడు


పూజలు అందుకుంటున్న వెండి వినాయకుడు


వెండి వినాయకుణ్ని పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు: లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించిన వరసిద్ధి వెండి వినాయక విగ్రహాన్ని పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. గత 28 సంవత్సరాలు వెండి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి వినాయక చవితి సంబరాలను జరుపుకుంటున్న విషయం తెలిసిందే. చవితి ఉత్సవాల్లో భాగంగా విగ్రహ దాత పువ్వాడి చంద్రశేఖర్ ఇంట్లో వెండి వినాయకుడికి(120 కిలోల బరువు) ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. ఆర్యవైశ్య మహిళలు హారతులిస్తూ ఊరేగింపు ముందు నడిచారు. గాంధీ చౌక్ వద్ద స్వామి శాశ్వత ఉయ్యాల సేవ దాత మంచికంటి భాస్కర్‌రంగయ్య కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయానికి చేర్చారు. ఈసందర్భంగా వేదపండితులు వెండి వినాయకుడిని ప్రత్యేక పీఠంపై ఉంచి పంచగంగతో అభిషేకం చేశారు. 108 వెండి పుష్పాలతో అర్చన, ఊంజల్ సేవ గావించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. వినాయక ఉత్సవ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సిద్దంశెట్టి సంజీవయ్య, గుంతారమేష్‌బాబు, కోశాధికారి పువ్వాడి శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు గోపా జగదీష్, శ్రీ కస్తూర్బా గాంధీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

శివాలయంలో శ్రీశైలం పీఠాధిపతి ప్రత్యేక పూజలు


రామలింగేశ్వరస్వామి సన్నిధిలో శ్రీశైలం పీఠాధిపతి

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని రామలింగేశ్వర స్వామిని ఆదివారం శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చెన్న సిద్దారామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామికి పీఠాధిపతి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పదిరోజుల క్రితం ఆలయంలో ప్రారంభించిన రాజగోపురాన్ని పరిశీలించిన స్వామీజీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, సభ్యులను అభినందించారు. అనంతరం భక్తులకు స్వామీజీ ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, ఎం.తిమ్మారెడ్డి, కోశాధికారి వీరుపాక్షిరెడ్డి, రామస్వామి గుడి ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మల్లికార్జున శాస్త్రి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో బీకేఎస్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శింగనమల నియోజక వర్గం స్థాయిలో జరిగిన అండర్-14,17 బాల బాలికల అథ్లెటిక్స్‌లో స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని పాఠశాల హెచ్ఎం వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో అండర్-17 బాలుర విభాగం జావలిన్, డిస్క్ త్రోలో శశి ప్రథమ, అండర్-17 బాలుర విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో కుమార్ ద్వితీయ స్థానం సాధించాడన్నారు. అండర్-17 బాలికల విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో పావని ద్వితీయ, అండర్-17 బాలుర విభాగంలో లాంగ్ జంప్‌లో వివేక్ ప్రథమ, కుమార్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. అండర్-17 బాలికల విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో కీర్తన తృతీయ, 300 మీటర్ల పరుగు పందెంలో పూజిత తృతీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం


మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: వినాయక చవితిని పురస్కరించుకుని ఇళ్లు, మండపాల్లో మట్టి విగ్రహాలనే కొలువుదీర్చి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్, మోహన్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ఎల్‌వీ థియేటర్ వద్ద ప్రజలకు వందలాది మట్టి వినాయక ప్రతిమలను సంఘం నాయకులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు భీమలింగయ్యస్వామి, విశ్వనాథ్, ఉపాధ్యక్షులు నాగరాజు, వీరప్రకాష్, కోశాధికారి సురేష్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి నరేష్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన శంకర్

పామిడి: మండలంలోని దిబ్బసానిపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..ఎద్దులపల్లి గ్రామానికి చెందిన శంకర్ వజ్రకరూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఎద్దులపల్లి అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుత్తి: నరసాపురం వద్ద 63వ జాతీయ రహదారిపై బైక్ పైనుంచి పడి ఓవ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. గుత్తికి చెందిన సద్దాం బైక్‌పై ఆదివారం గుంతకల్లుకు బయలు దేరాడు. నరసాపురం వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కౌలు రైతు ఆత్మహత్య

పెద్దవడుగూరు: ఏ.తిమ్మాపురంలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బెస్త రాము(30) తనకున్న రెండెకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేసేవాడు. ఈ క్రమంలో పంట చేతికిరాక దాదాపు రూ.5 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



శింగనమల: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి


డాక్టర్ ఫిర్దోస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనంత

శింగనమల: ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి వైద్యులకు సూచించారు. ఉన్నత చదువుల కోసం వెళుతున్న తరిమెల పీహెచ్‌సీ డాక్టర్ ఫిర్దోస్‌ను ఆదివారం అనంతపురంలోని విద్యుత్ కళాభారతిలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, శింగనమల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్, రమణనాయక్, తరిమెల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్. శంకర్‌నాయక్, సీహెచ్ఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబయ్యకు సన్మానం


బాబయ్యను సన్మానిస్తున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: ఇటీవల వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన దూదేకుల బాబయ్యను జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సన్మానించారు. ఆదివారం పైలా నరసింహయ్య తాడిపత్రికి రావడంతో ఆయనను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పైలా బాబయ్యను ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బాబయ్యకు సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు గురుప్రసాద్‌రెడ్డి, రాంశేఖర్, డీపీ కుమార్ తదితరులు నూతన బాబయ్యను సన్మానించి, అభినందనలు తెలిపారు.

నాగభూషణ మృతి బాధాకరం


నాగభూషణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురం వైఎస్సార్‌సీపీ నేత మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ కామాక్షి భర్త నాగభూషణ మృతి బాధాకరమని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని మాజీ సర్పంచ్ నాగభూషణ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాగభూషణ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాగభూషణ కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, బుల్లే నారాయణస్వామి, మాజీ ఉప సర్పంచ్ నాగ, సాకే లక్ష్మీనారాయణ, మల్లయ్య, నాగరాజు, గంగరాజు, నాగయ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: మర్తాడులో ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన నాగేంద్ర(37) అనే వ్యక్తి తండ్రి, అన్నతో కలిసి భూమి కౌలుకు తీసుకొని చీనీ, వరి పంట సాగు చేసేవారు. పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

చవితి సందడి షురూ


తాడిపత్రి అర్బన్: మార్కెట్లో వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

తాడిపత్రి అర్బన్/ గుంతకల్లు/ గుత్తి: తాడిపత్రి, గుంతకల్లు గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో ఆదివారం వినాయక చవితి సందడి కనిపించింది. వినాయక ప్రతిమలు, పండుగ సామగ్రి కొనుగోలు చేయడానికి జనాలు పోటీలు పడ్డారు. తాడిపత్రిలోని పోలీస్ స్టేషన్ సర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్, కూరగాయల మార్కెట్ వద్ద, గుంతకల్లులోని గాంధీచౌక్, సంత మార్కెట్ ఏరియా, ధర్మవరం గేట్ రోడ్డు, కొత్త బస్టాండ్ రోడ్డు, గుత్తిలోని గాంధీ సర్కిల్, రాయల్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ , అమృత్ థియేటర్ రోడ్లలో జన సందడి నెలకొంది. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.


గుత్తి: జనాలతో నిండిపోయిన అమృత్ థియేటర్ రోడ్డు


గుత్తి: వినాయక ప్రతిమలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు


గుంతకల్లు: గాంధీచౌక్‌లో వినాయక చవితి సందడి

22న తలనీలాల వేలం

పెద్దవప్పూరు: అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో తలనీలాల పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాఘ మాసం మినహా విడి దినాల్లో మాత్రమే తలనీలాలు పోగు చేసుకుకోవచ్చని తెలిపారు. వేలం పాటలో పాల్గొన దలచినవారు రూ. 50 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.